
సాక్షి
గుంటూరు
మంగళవారం । 12 । నవంబర్ । 2024




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 6,024 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాలువకు 2940 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ కృష్ణానదీ పరివాహక ప్రాంతాల నుంచి 290 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 6000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

శివయ్య సేవలో వేణుగోపాలరెడ్డి దంపతులు



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిశు సంక్షేమశాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వేణుగోపాలరెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఉప కమిషనర్ కేబీ శ్రీనివాస్, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం వేణుగోపాలరెడ్డి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని స్వామి శేషవస్త్రంతో సత్కరించి వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఉప కమిషనర్ శ్రీనివాస్ స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

నేడు సుంకం వసూలు హక్కులపై బహిరంగ వేలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఆధీనంలోని రేవుల్లో సుంకం వసూలు చేసుకునే హక్కులపై మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అచ్చంపేట, మాచవరం, అమరావతి, కొల్లిపర మండలాల్లోని కృష్ణానదీ పరివాహక రేవుల్లో గెజిట్ నిబంధనల మేరకు ఈనెల 12 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కాలానికి సుంకం వసూలు హక్కులపై ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను జెడ్పీ కార్యాలయం నుంచి పొందాలని తెలిపారు.

వరల్డ్ బాడీబిల్డింగ్‌లో రవికుమార్‌కు బంగారు పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈనెల 9 నుంచి 11 వరకు థాయిలాండ్‌లోని పతాయ్‌లో నిర్వహించిన వరల్డ్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో నిశ్శంకర రావు రవి కుమార్ బంగారు పతకం గెలుపొందాడు. సోమవారం 70 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో అత్యుత్తమ ప్రదర్శనకు గాను ఈ ఘనత సాధించాడు. మొత్తం 56 దేశాల నుంచి సుమారు 450 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. గుంటూరు శివారు ఏటుకూరుకు చెందిన రవి కుమార్ పేద కుటుంబం నుంచి వచ్చారు. గతంలో ఆయన మిస్టర్ ఆంధ్ర, మిస్టర్ ఇండియా, మిస్టర్ ఏషియా పోటీల్లో అనేక పతకాలు సాధించారు. రవి కుమార్ టెలిఫోన్‌లో 'సాక్షి'తో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ఎంతో ప్రోత్సహించారన్నారు. ఆయన ఆర్జాస్ స్టీల్స్ ఎండీ శ్రీధర్ క్రిష్ణమూర్తి చేత తనకు ఆర్థిక చేయూతనందించారని చెప్పారు.

గ్రంథాలయశాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: వావిలాల గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయశాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు (సీఎల్ఐఎస్సీ) దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ దోనె రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసి, 18 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు కోర్సులో చేరేందుకు అర్హులని, ఐదు నెలల కాల వ్యవధిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుందని తెలిపారు. వివరాలకు 93962 38946 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

హామీలన్నీ హాంఫట్

- ఇరిగేషన్‌కు మొండిచెయ్యి
- గుంటూరు చానల్ ఊసే లేదు
- 'సూపర్‌సిక్స్'కు నీళ్లొదిలారు..
- అన్నదాతలు, యువత, మహిళలకు రిక్తహస్తం



ఆధునీకీకరణ కోసం నిరీక్షిస్తున్న గుంటూరు చానల్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల ముందు ఆర్భాటంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నీళ్లొదిలింది. సోమవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలనూ నిరాశపరిచింది. ఎన్నికల హామీల అమలు దిశగా అసలు అడుగులు పడలేదు. కొన్నింటికి నిధులు ప్రకటించినా అవి ఏ మాత్రమూ సరిపోయే అవకాశం లేదు.

నీటి పారుదలకు అన్యాయం

రైతును రాజును చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం రైతును ఆదుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ రంగానికి కేటాయింపుల్లోనూ అన్యాయం చేశారు. కృష్ణాడెల్టా ఆధునికీకరణకు నామమాత్రంగానే నిధులు కేటాయించారు. ఇటీవల భారీ వర్షాలకు సాగునీటి కాల్వలకు గండ్లు పడటం, డ్రెయినేజీ వ్యవస్థ పాడైపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. వీటిని పూర్తిస్థాయిలో బాగుచేయడానికి నిధులు కేటాయించలేదు. మరోవైపు ఎన్నికల ముందు హోరెత్తించిన గుంటూరు చానల్ విస్తరణ, ఆధునీకీకరణకు నిధులు కేటాయించలేదు. గుంటూరు చానల్‌ను పొడిగించడానికి భూసేకరణకే రూ.120 కోట్లు కావాలి. ఇది కాకుండా మరో రూ.150 కోట్ల వరకూ విస్తరణ, పొడిగింపునకు కావాలి. వీటికి అసలు నిధులు కేటాయించలేదు. పులిచింతలకు నిర్వహణ ఖర్చులు కేటాయించగా, నాగార్జునసాగర్‌కు అసలు కేటాయింపుల్లేవు.

అన్నదాతకు నిరాశే..

రైతులకు ఏడాదికి రూ. 20వేల చొప్పున అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.4,500 కోట్లు మాత్రమే కేటాయించింది. గతంలో 13,500 ఇచ్చినప్పుడే రూ.ఆరువేల కోట్లకుపైగా కేటాయింపులు జరిగాయి. గుంటూరు జిల్లాలో 1,24,645 మంది రైతులు ఉన్నారు. ఒక్క గుంటూరు జిల్లాకే రూ.249.79 కోట్లు కావాల్సి ఉంటుంది.

మహిళలకు చెయ్యిచ్చారు

అధికారంలోకి వస్తే 18–59 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ1,500 ఇస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో పింఛన్ పొందేవారు కాకుండా ఈ పథకానికి అర్హత ఉన్న మహిళలు 7,28,391 మంది ఉన్నారు. అసలు ఈ బడ్జెట్‌లో ఈ పథకానికి సంబంధించిన ఊసే లేదు. వీరంతా బాబు మాటను నమ్మి మోసపోయామని ఊసూరుమంటున్నారు.

యువతకు భరోసా ఏదీ?

ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, సంపద సృష్టిస్తామని, నిరుద్యోగ భృతి కింద నెలకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే ఈ బడ్జెట్‌లో నిరుద్యోగభృతి ఊసేలేదు. జిల్లాలో మూడు లక్షల ఐదు వేల మంది యువత ఉన్నట్లు ఒక అంచనా. బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల వారికి ఈ ఏడాది నిరుద్యోగ భృతి రానట్లేనని తేలిపోయింది.

'సూపర్' మాయ!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెద్దగా చేయకపోవడం వల్ల రైతులు, యువత, మహిళల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈ బడ్జెట్ సొంత భజన, విపక్షాలను విమర్శించడానికి తప్ప అభివృద్ధికి పనికి రాదని విపక్ష నేతలు నిప్పులు చెరిగారు.

తల్లికి వందనం ఎక్కడ?

మీ ఇంట్లో ఎంతమంది స్కూల్‌కు వెళ్లే పిల్లలు ఉంటే వారందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పథకం ద్వారా ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి సర్కారు బడ్జెట్‌లో మొక్కుబడిగా నిధులు కేటాయించింది. ఇప్పటికే విద్యాసంవత్సరం సగానికి పైగా అయిపోయింది. కేటాయించిన నిధులు చూస్తుంటే ఈ ఏడాది వారికి తల్లికి వందనం అందడం కష్టమే అని తెలుస్తోంది. జిల్లాలో 2,01,590 మంది విద్యార్థులు ఉన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి నిధుల కేటాయింపు లేదు. ఎన్నికల హామీలను మొదటి సంవత్సరమే తుంగలో తొక్కడం పట్ల అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని

సీఐ మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణం

- సీఐ రమేష్‌పై చర్యలు తీసుకోవాలి
- జగనన్న నాయకత్వంలో దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్‌లు
- రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గుతున్న పోలీస్ శాఖ
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని ధ్వజం

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు సుధారాణిని వేధించిన సీఐ తదితరులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా సబ్‌జైలులో ఉన్న సుధారాణిని సోమవారం విడదల రజిని, సుధారాణి పిల్లలు, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నూరి ఫాతిమా, లీగల్‌సెల్ బృందంతో కలిసి పరామర్శించారు. అనంతరం జిల్లా జైలు వద్ద రజిని విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పాలన చేస్తోందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మహిళల రక్షణ కోసం దిశ యాప్‌ను, దిశ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని చిలకలూరిపేటకు చెందిన సుధారాణి, ఆమె భర్త వెంకటరెడ్డి, ఇద్దరు సంతానంతో తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ సిరిసిల్లలో ఏదో పని చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా యాక్టివిస్టు కావడం ఏదో పెద్ద పాపం అన్నట్టు తెలంగాణ రాష్ట్రం నుంచి భార్య, భర్తలను తీసుకు వచ్చి, నాలుగు రోజులపాటు పోలీసులు వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట టౌన్ సీఐ రమేష్ ఒక మహిళపై థర్డ్ డిగ్రీ ఎలా ప్రయోగిస్తారని ప్రశ్నించారు. సీఐ రమేష్ సుధారాణిపై వినలేని అసభ్య పదజాలం వాడారని విమర్శించారు. సుధారాణి తన ఇద్దరు చిన్నారులు పవన్‌కోటిరెడ్డి, తన్వీతారెడ్డిలను వెంకటరెడ్డి తండ్రి సైదారెడ్డికి అప్పజెప్పే సమయంలో సీఐ రమేష్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. సుధారాణికి తామున్నామన్న భరోసా కల్పించామని, ధైర్యంగా ఉండాలని చెప్పామని పేర్కొన్నారు. సుధారాణి పోలీసులు పెట్టిన చిత్రహింసల గురించి చెబుతూ కన్నీరుపెడుతుంటే ఒక సాటి మహిళగా తన హృదయం విలవిల్లాడిందని విచారం వ్యక్తం చేశారు. పోలీసులకు మానవత్వం ఉందా అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయని ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. సుధారాణి పడిన బాధను విన్న న్యాయమూర్తి విచారం వ్యక్తం చేసి వాంగ్మూలం రికార్డు చేశారని పేర్కొన్నారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ మహిళలపై చెయ్యి చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సుధారాణిని కొట్టిన సీఐ రమేష్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా అనేది వైఎస్సార్ సీపీకే కాదు.. తెలుగుదేశం పార్టీకీ ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో లీగల్‌సెల్ నాయకులు పోలూరి వెంకటరెడ్డి, శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

- 7.2 కేజీల గంజాయి, రూ.3,800 స్వాధీనం
- గంజాయి కొని తాగే 18 మందికి స్టేషన్ బెయిల్
- మొత్తం 25 మందిపై కేసులు
- మరో ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకుంటాం
- పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న పట్టాభిపురం సీఐ వీరేంద్ర బాబు, చిత్రంలో అరెస్టయిన గంజాయి విక్రేతలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రామన్నపేటలోని బాలుర హాస్టల్లో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ఏడుగురితోపాటు కొని తాగుతున్న 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 18 మందికి స్టేషన్ బెయిల్ మంజూరు చేయగా, ఏడుగురిని అరెస్టు చేసి 7.2 కేజీల గంజాయి, రూ.3,800 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీరేంద్రబాబు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ అల్తాఫ్, సంగడిగుంట ప్రాంతానికి చెందిన మొహమ్మద్ దావుద్దీన్, కొత్తపేటకు చెందిన షేక్.రోషన్ సిమ్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరు శ్రీనివాసరావుపేటకు చెందిన ఏసీ మెకానిక్ షేక్ యూసుఫ్, కూలి బాలాజీ, చలపతి కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న పల్నాడు జిల్లా శావల్యాపురానికి చెందిన ఎగినాటి అనిల్, గుంటూరు పొన్నూరు రోడ్డు, చంద్రబాబు కాలనీ 6వ లైన్‌కు చెందిన వంట మేస్త్రీ పందిరి సుధార్‌తో కలిసి అరకు నుంచి గంజాయి తెచ్చి గుంటూరులో విక్రయిస్తుంటారు. వీరంతా వ్యసనాలకు బానిసలై అరకు నుంచి సరుకు తెచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి అరకుకు చెందిన భీం, దీపక్ సరుకు అమ్ముతున్నారు. అల్తాఫ్, దావుద్దీన్, రోషన్, యూసుఫ్, బాలాజీ ఈనెల 8న ద్విచక్రవాహనంపై అరకు వెళ్ళి భీం, దీపక్ వద్ద గంజాయి కొని దానిని ఎక్కువ ధరకు అమ్ముకుందామని గుంటూరు వచ్చారు. అక్కడ అనిల్, సుధాకర్‌లతో కలిసి నేతాజీ నగర్ చెరువు వద్దకు చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు చాకచక్యంగా ఏడుగురినీ అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న 7.2 కేజీల గంజాయి, రూ.38,00 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరి సెల్‌ఫోన్, వాట్సాప్, ఫోన్ కాల్స్ ద్వారా వీరి వద్ద మరో 18 మంది గంజాయి కొని సేవిస్తున్నారని గుర్తించి వారినీ అదుపులోకి తీసుకున్నారు. 18 మందికీ స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. అరకుకు చెందిన భీం, దీపక్‌ను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ వెల్లడించారు. విద్యార్థులు అల్ప సంతోషాల కోసం వ్యసనాలకు బానిసలు కావద్దని సీఐ హితవు పలికారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, గుంటూరు పశ్చిమ డీఎస్పీ జయరాంప్రసాద్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం

- కలెక్టర్ నాగలక్ష్మి
- గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కారమే మన ప్రథమ కర్తవ్యమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ అర్జీలపై ప్రతివారం సమీక్షించి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. అర్జీదారులను పదేపదే తిప్పుకోవద్దని సూచించారు. నిర్లక్ష్యంగా ఉంటే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం వచ్చిన 187 ఫిర్యాదులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

రెవెన్యూ భవన్‌పై చర్యలు తీసుకోండి



అనేక మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుద్యోగ యువత ఉపాధిని తీసేసి వారి స్వార్థం కోసం అనుమతులు లేకుండా సాక్షాత్తూ కలెక్టరేట్‌లో నిర్మించిన రెవెన్యూ భవన్‌పై చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదు. కలెక్టరేట్ ఆవరణలో ఈ ఆక్రమణలేంటి. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం.

– ఈమని చంద్రశేఖర్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, గుంటూరు

డెత్ సర్టిఫికెట్ కోసం నాలుగేళ్లుగా తిప్పకుంటున్నారు



నా భర్త పేతురు 2021లో ప్రత్తిపాడు మండలం, పెద గొట్టిపాడులో మరణించారు. అప్పటి నుంచి నేను ఆయన డెత్ సర్టిఫికెట్ కోసం తిరుగుతున్నా ఫలితం లేదు. నాకు ఇద్దరు బిడ్డలు ఉన్నారు. డెత్ సర్టిఫికెట్ ఇస్తే ఒంటరి మహిళ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటాను.

– జొన్నలగడ్డ మేరి, ప్రత్తిపాడు మండలం, పెద గొట్టిపాడు

రైతులను మోసం చేయొద్దు



కూటమి ప్రభుత్వానికి రైతుల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి లేదు. పెదనందిపాడు మండలం నాగులపాడులో మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఇప్పటి వరకు ప్రారంభించలేదు. పంట చేతికొస్తున్న తరుణంలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. క్వింటా మద్దతు ధర రూ.7,520 ఉంటే దళారులు 5,000 వేలకే రైతుల నుంచి తీసుకుంటున్నారు. సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేవు. వెంటనే వాటిని ఆర్‌బీకేల్లో ఉంచాలి.

–అజయ్ కుమార్, తదితరులు జిల్లా రైతు సంఘం నాయకులు

శివోహం

శివనామస్మరణతో మార్మోగిన పెదకాకాని



శివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



మల్లేశ్వరస్వామి మూలవిరాట్

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెదకాకాని శివాలయం శివ నామస్మరణతో మార్మోగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దశమి కార్తీకమాసం రెండో సోమవారం పురస్కరించుకుని కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేసేందుకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే యజ్ఞాల బావి వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించారు. ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్ళు పొంగించి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భ్రమరాంబ మల్లేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో దాతల సహకారంతో ఉచితంగా పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. ప్రభలతో తరలివచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అధికంగా అంతరాలయ అభిషేకాలు, దర్శనాలు, ఏకవారాభిషేక పూజలు, రాహుకేతు పూజలు, అన్నప్రాశనలు, చెవిపోగులు కుట్టించడం, నామకరణలు, వాహనపూజలు, నవగ్రహ పూజలు అధికంగా జరిగాయి. వివిధ సేవా కార్యక్రమాల ద్వారా స్వామికి ఒక్కరోజులో రూ.6,50,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ కామినేని బసవ శ్రీనివాస్ తెలిపారు. ఉచిత అన్నదాన కార్యక్రమం ద్వారా 3,500 మందికి అన్నప్రసాదాల పంపిణీ జరిగింది.

సోషల్ మీడియాపై కక్ష

- కొనసాగుతున్న వేధింపులు
- అసలే అక్రమ అరెస్టులు
- ఆపై విచారణ పేరుతో నరకం
- ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే బాధితులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం లోపాలను ఎత్తిచూపిస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాపై అక్రమ కేసులు ఆగడం లేదు. ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు తప్పుడు కేసులు పెడుతూనే ఉన్నారు. ఇప్పటికే పోలీసు రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డిపై తాజాగా సోమవారం బాపట్ల జిల్లా సంతమాగులూరు, కర్లపాలెం పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. పార్టీ యువజన విభాగం అధ్యక్షులు కల్లం హరికృష్ణారెడ్డిపై అద్దంకిలో కేసు నమోదు చేశారు. ఇవే కాకుండా పాత కేసులు బయటకు తీసి వీరిని అందులో అక్రమంగా ఇరికించే యత్నాలు ముమ్మరం చేశారు.

తాడేపల్లి పోలీసుల వేధింపులు తారాస్థాయికి..

ఎన్నికల ముందు టీడీపీ గూండాల చేతిలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వెంకటరెడ్డి కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఆ కేసులో ప్రధాన నిందితుడి చేత తెలుగుదేశం నాయకులు జరగని ఘటనను జరిగినట్లు చిత్రీకరిస్తూ గత నెల 14న వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, సోషల్ మీడియా గుంటూరు జిల్లా అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జక్కిరెడ్డి కృష్ణారెడ్డిలపై అక్రమ కేసు నమోదు చేయించారు. ఈ నేతలు ముగ్గురూ తనను చంపుతానని బెదిరించారని హత్య కేసు నిందితుడు కేసు పెట్టడం గమనార్హం. దీంతో వైఎస్సార్ సీపీ నేతలు ముగ్గురూ హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రెండువారాల పాటు వారిని అరెస్టు చేయవద్దంటూ ఆదేశించింది. విచారణకు సహకరించాలని ముగ్గురు వైఎస్సార్ సీపీ నేతలకు సూచించింది. కోర్టు సూచనను తమకు అనుకూలంగా మలుచుకుని పోలీసులు టీడీపీ నాయకులు చెప్పిన విధంగా విచారణ పేరుతో వేధిస్తున్నారు. గంటల తరబడి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టి నరకం చూపిస్తున్నారు. రెండురోజుల క్రితం మున్నంగి వివేకానందరెడ్డిని విచారణ పేరుతో పిలిపించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఉంచారు. అనేక రకాలుగా ప్రశ్నించి నేరం ఒప్పుకోవాలని ఒత్తిడి తెచ్చారు. కనీసం లాయర్‌ను కూడా అనుమతించకుండా పోలీసులు ఇలా విచారించడం పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన వారిపైనా తప్పుడు కేసులు బనాయించేందుకు యత్నాలు జరుగుతున్నాయి. ఈ తతంగం అంతా మంత్రి నారా లోకేష్ కార్యాలయం కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,200 గరిష్ఠం : రూ. 3,300

మోడల్ ధర రూ. 2,800

క్లుప్తంగా

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్



తాడికొండ: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్–6 పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వి.వి.ప్రసాద్ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తాడికొండ తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తి అయిందని, కాని రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామన్న రూ. 20 వేలు అందించకుండా మోసం చేసిందన్నారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్ పూర్తయిందని, వర్షాల వల్ల రైతుల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ. 13,500లు రైతులకు ఇచ్చి ఆదుకుందని గుర్తు చేశారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు కె.నాసరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం పచ్చల శివాజీ, వ్యకాస జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, గుర్రం కొండ సత్యానందం, కంభంపాటి దేవునిదయ, రేపూడి శ్రీనివాసరావు, తోకల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రసంగం మొత్తం ఆత్మస్తుతి, పరనింద

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం మొత్తం ప్రస్తుత సీఎంను కీర్తించడం, గత ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్ప కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న దానిపై స్పష్టత లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. స్థానిక బ్రాడీ పేటలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రామారావు మాట్లాడారు. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేశారన్నారు. దళితుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. కార్మికుల గురించి విస్మరించారని ధ్వజమెత్తారు.

ఆర్థిక మోసాలపై ఫిర్యాదుల వెల్లువ

- పోలీస్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన బాధితులు
- ఎస్పీ లేకున్నా.. అర్జీలు స్వీకరించిన సిబ్బంది

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమానికి ఆర్థిక మోసాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులు బందోబస్తు విధులకు వెళ్లినా ఎస్పీ కార్యాలయ సిబ్బంది గ్రీవెన్స్‌ను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపారు.



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిబ్బంది

చిట్టీల డబ్బులు ఇవ్వకుండా పరారీ



మేమిద్దరం కలిసి అదే ప్రాంతానికి చెందిన అనసూయ అనే మహిళల వద్ద రూ.5 లక్షలు, రూ.3 లక్షల చిట్టీలు వేశాం. అయితే అవి పూర్తికాక ముందే అనసూయ డబ్బులతో పరారైంది. మేమిద్దరం కలిసి సుమారు రూ.7లక్షల వరకు చెల్లించాం. చిట్టీలు పాడుకోలేదు. అవసరాలకు ఉపయోగపడతాయని భావించి డబ్బు చెల్లించాం. మోసపోయాం. న్యాయం చేయండి.

– గుడివాడ రత్నకుమారి, విజయలక్ష్మి, నల్లచెరువు గుంటూరు

భాష్యం కళాశాలలో క్యాంటిన్ పేరిట మోసం



నేను గ్యాస్ డెలివరీ బాయ్ అసిస్టెంట్‌ను. నాకు ముగ్గురు ఆడ పిల్లలు. బృందావన్ గార్డెన్స్‌లోని ఫుడ్ పంజా హోటల్ మేనేజర్ చక్రవరం ఉదయ్ పరిచయమయ్యాడు. అతను తాను హోటల్లో ఉద్యోగం మానేశానని, భాష్యం కళాశాలలో తెలిసిన వారు ఉన్నారని, అక్కడ ఇద్దరం కలిసి క్యాంటిన్ ఏర్పాటు చేద్దామని నమ్మబలికాడు. నేను, గ్యాస్ డెలివరీ బాయ్ నాగేశ్వరరావు కలిసి రూ.1.20 లక్షలు అతనికి ఇచ్చాము. అయితే ఉదయ్ గత మే నుంచి కాలయాపన చేస్తూ వచ్చాడు. దీనిపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

– కుటాల హనుమంతరావు, గుజ్జనగుండ్ల, గుంటూరు

ఆస్తి కోసం హతమార్చాలని చూస్తున్నారు



నాకు భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. పొలం పనులు చేసుకుంటూ జీవిస్తున్నా. రెండేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నా. నా పెద్ద కుమారుడు శ్రీనివాసరావు అప్పులు కావడంతో నా పొలంలో అర ఎకరం విక్రయించి అప్పులు తీర్చాను. మిగిలిన ఎకరంన్నరలో పెద్దకుమారుడికి అర ఎకరం, చిన్న కుమారుడికి అర ఎకరం రాశాను. నా పేరు మీద అర ఎకరం పొలం, ఇల్లు ఉంది. నా భార్య, నా పెద్దకుమారుడు, నా బావమరిది ఇల్లు, అర ఎకరం కూడా ఇవ్వాలని వేధిస్తున్నారు. నన్ను చంపాలని చూస్తున్నారు. కాకాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం నాతో ఎవరూ ఉండటం లేదు. మా అమ్మ నాన్న నా వద్ద ఉంటున్నారు. మా అమ్మ ఈ వయస్సులో నాకు అన్నం వండి పెడుతోంది.

– నల్లమేకల ఉదయ్ భాస్కర్, అనవర్లపూడి, పెదకాకాని

డబ్బు కాజేసి వేధింపులు



మేం తల్లీకూతుళ్లం. పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో మాకున్న 60 గజాల్లో ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యాం. నగరాలకు చెందిన బిల్డర్ మోహమాటం గోపి వచ్చి ఇంటిని నిర్మించి ఇస్తానని చెప్పి పని ప్రారంభించాడు. మా వద్ద రూ.38 లక్షల వరకు నగదు తీసుకున్నాడు. ఇల్లు కట్టి మాకు అప్పగించాడు. మాకు ఇంకా రూ.9 లక్షలు ఇవ్వాలి. నాకు తెలియకుండా నా కుమార్తె రాజ్యలక్ష్మి దగ్గర రూ.9 లక్షలు తీసుకుని అదే డబ్బును నా ఖాతాలో వేశాడు. ఆ డబ్బు డ్రా చేసుకున్నాడు. మా ఇద్దరికీ చదువు లేకపోవడంతో డబ్బులు బ్యాంకులోనే ఉన్నాయని, ప్రతినెలా రూ.ఐదు వేలు వడ్డీ వస్తుందని నమ్మబలికాడు. ఆరునెలలు వడ్డీ తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ తర్వాత ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి బ్యాంకులో విచారించగా బ్యాంకులో డబ్బు లేదు. దీంతో నిలదీయడంతో తిరిగి ఇస్తానని నమ్మబలికాడు. కానీ ఇవ్వడం లేదు. సచివాలయ సిబ్బంది సాయంతో ఇంటికి ప్లాన్ లేదని, కుళాయి కట్ చేస్తామని వేధింపులకు గురిచేస్తున్నాడు. మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలి.

–గుజ్జల లక్ష్మి, పందుగుల రాజ్యలక్ష్మి, తల్లీకూతుళ్లు, కొండయ్యకాలనీ, గుంటూరు

రూ.లక్ష కడితే రూ.రెండు లక్షలంటూ..



రూ.లక్ష కడితే రూ.రెండు లక్షలు చెల్లిస్తానని నమ్మించి చల్లవారిపాలెం ప్రాంతానికి చెందిన ఆంజనేయులు నా వద్ద రూ.22 లక్షలు వరకు తీసుకున్నాడు. నేను బయట ఫైనాన్స్ వ్యాపారుల నుంచి వడ్డీకి తీసుకు వస్తున్నా అని చెప్పి ఇచ్చాను. ఐదేళ్లవుతున్నా తిరిగి సొమ్ము ఇవ్వడం లేదు. అదేమని అడిగితే సమాధానం చెప్పడం లేదు. ఇంటికి వెళ్తే కుక్కలతో దాడి చేయిస్తున్నాడు. మహిళ అని కూడా చూడకుండా దుర్భాషలాడుతున్నాడు. తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే సివిల్ విషయం అంటూ తప్పించుకుంటున్నారు.

– మేరుగ లావణ్య, నల్లపాడు, గుంటూరు

జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు విద్యార్థినులు



గుంటూరు ఎడ్యుకేషన్: కోల్‌కతాలో జరగనున్న జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత తెలిపారు. సోమవారం సాంబశివపేటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ సీఈసీ విద్యార్థిని ఒ.కీర్తి శ్రీఅండర్–19 రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో నాలుగు విభాగాల్లో నాలుగు స్వర్ణ పతకాలు సాధించిందని చెప్పారు. మరో విద్యార్థిని పి.రూప ఒక విభాగంలో స్వర్ణ పతకం, మూడు విభాగాల్లో రజత పతకాలను సాధించినట్లు వివరించారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ విద్యార్థి స్వాతి అండర్–17 రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజతం పతకం, సీఈసీ విద్యార్థి బి.మనీషా వాలీబాల్‌లో ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్ సునీతతో పాటు అధ్యాపక బృందం అభినందించింది.

46,099 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 46,099 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 43,750 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 17,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 25,972 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రత్యేక కృషి

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్ : చిన్నారుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించి ప్రత్యేక పోస్టర్‌ను కలెక్టర్, జేసీ భార్గవ్ తేజ, అధికారులు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14న బాలల దినోత్సవం రోజు క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు.

గురు, శనివారాల్లో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఎదుగుదలకు సంబంధించి లోపాలను గుర్తించేందుకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొని లోపాలున్న పిల్లల్ని గుర్తించి వైద్యాధికారికి రిఫర్ చేయాలన్నారు. వైద్య పరీక్షల్లో ఉన్న అంశాల ప్రకారం చిన్నారులకు చికిత్స జరుగుతుందన్నారు. నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలతోపాటు వైద్యులు చికిత్స చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పరిశీలించారు.



క్యాన్సర్ స్క్రీనింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ

న్యూమోనియా రహిత సమాజమే లక్ష్యం



డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: న్యూమోనియా రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా సోమవారం మీడియాతో మాట్లాడారు. ఊపిరితిత్తుల్లో అసాధారణ ద్రవం చేరడం వల్ల శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిని కలిగించే పరిస్థితిని న్యూమోనియా అంటారన్నారు. దీనినే ఊపిరితిత్తులలో నెమ్ము చేరడం అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. నవంబర్ 12 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు సాన్స్(న్యూమోనియా లక్షణాలను త్వరగా గుర్తిద్దాం పిల్లల బాల్యాన్ని ఊపిరి పీల్చుకోనిద్దాం) ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారికి న్యూమోనియా లక్షణాలు ఉన్నాయోమో పరీక్షిస్తారని, ఒక వేళ ఉంటే పీహెచ్‌సీ వైద్యాధికారికి రిఫర్ చేస్తారని, పీహెచ్‌సీ డాక్టర్ చిన్నారులను పరీక్షించి అవసరమైన చికిత్స అందేలా చూస్తారని వివరించారు. దేశంలో ఏటా న్యూమోనియా వల్ల ఐదేళ్లలోపు పిల్లల మరణాలు 17.5 శాతం సంభవిస్తున్నట్టు వెల్లడించారు. న్యూమోనియా ఐదేళ్లలోపు పిల్లలకు, తక్కువ పౌష్టికాహారం తీసుకునే పిల్లలకు, 60ఏళ్ల పైబడిన వారికే వస్తుందన్నారు.

ఔత్సాహిక బీసీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక బీసీ పారిశ్రామికవేత్తలను రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను సచివాలయంలోని ఆమె ఛాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘాల ఉమ్మడి యాజమాన్యంతో ఒక నాన్ బ్యాంకింగ్ సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత కో–ఆపరేటివ్ చట్టాల ప్రకారం సహకార సంఘం ఏర్పాటుకు పదిమంది సభ్యులు కావాల్సి ఉందని, దానిని మార్చి కంపెనీస్ చట్టం లాగా ఒకరు లేదా ఇద్దరితో బీసీలు సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఏర్పాటుకు ముందుకు వచ్చే బీసీలకు ప్రభుత్వ నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా, ఒకే ఒక్క దరఖాస్తుతో అనుమతులు మంజూరు చేయాలని శంకరరావు విన్నవించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ బాలికల విజేత గుంటూరు

బాలుర విభాగ విజేత విజయనగరం



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన గుంటూరు జిల్లా జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

ప్రత్తిపాడు: రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు ముగిశాయి. మూడు రోజుల పాటు హోరాహోరీగా జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. కాగా జాతీయ స్థాయిలో ఆడే పోటీలకు అండర్–17 విభాగంలో బాల, బాలికల జట్లను ఆయా జిల్లాల క్రీడాకారులతో ఎంపిక చేశారు. ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోమూడు రోజులుగా జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్ బాల్ టోర్నమెంట్ కం సెలెక్షన్స్ సోమవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్కంఠభరితంగా జరిగిన పోటీల్లో బాలురు, బాలికల విభాగాల నుంచి ఎనిమిది జిల్లాల జట్లు సెమీ ఫైనల్స్‌లో తలపడగా, నాలుగు జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్షణ క్షణం ఉత్కంఠగా జరిగిన ఫైనల్స్‌లో బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుని విన్నర్‌గా నిలవగా. శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం సాధించి రన్నర్‌గా నిలిచింది. ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది.

దుమ్మురేపిన గుంటూరు బాలికలు..

అండర్ – 17 బాలికల విభాగంలో గుంటూరు బాలికలు ఆదరగొట్టారు. శ్రీకాకుళం జిల్లా జట్టుపై గెలిచి విజేతగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లా రన్నర్‌గా నిలవగా, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీకాంత్ రెడ్డి ప్రకటించారు.

బహుమతుల ప్రదానం..

బేస్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లుకు స్థానిక యనమదల హైస్కూల్లో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ పి. మస్తాన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ పి.బాలసుబ్రమణ్యం, సర్పంచ్ ఆదినారాయణ, ఎస్ఎంసి చైర్మన్ చౌదరిబాబు, గ్రామ పెద్దలు బ్రహ్మయ్య, మల్లంపాటి శేషగిరిరావుతో పాటు పలువురు ముఖ్యుల చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలు, మెడళ్లు, షీల్డులను అందించారు. టోర్నీ విజయవంతానికి కృషి చేసిన దాతలను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.నాగేశ్వరరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. గంగాధరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రవి, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జయరావు, ఇంటర్నేషనల్ సాఫ్ట్‌బాల్ రెఫరీ జగదీష్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ప్రసూన పాల్గొన్నారు.

మంత్రిగారూ స్పందించండి

- సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు ఇప్పించండి
- సీఐటీయూ డిమాండ్



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు యాజమాన్యం నుంచి రావాల్సిన రూ.43 కోట్లు మంజూరు చేసేలా మంగళగిరి శాసనసభ్యులు, మంత్రి నారా లోకేష్ చొరవ చూపించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. దుర్గారావు మాట్లాడుతూ యాజమన్యాం ఇప్పటికైనా స్పందించాలని, సమస్య పరిష్కారానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉందని, ప్రభుత్వం కూడా ఆదిశగా ఆలోచించి యాజమాన్యంతో చర్చలకు ఒప్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, సాంబయ్య, ఎం.ఆశీర్వాదం, నవనీతం, రమాదేవి, శారద, కె. ఆదినారాయణ, కృష్ణ, రమణ, జ్యోతి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.